క్లుప్తంగా

'కానిస్టేబుల్ అభ్యర్థులకు మూడు మార్కులు కలపాలి'

ఎంవీపీ కాలనీ: ఇటీవల జరిగిన కానిస్టేబుల్ ప్రిలిమినరీ ప్రశ్నపత్రంలో మూడు ప్రశ్నలకు జవాబులు లేనందున వాటికి అందరి అభ్యర్థులకు మార్కులు కలపాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గవర్నర్‌కు లేఖ రాసినట్టు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కానిస్టేబుల్ పరీక్షకు 5 లక్షల మంది హాజరుకాగా 95 వేల మంది మాత్రమే మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. మరింత మందికి అర్హత కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో కటాఫ్ మార్కులు సైతం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐ పరీక్షకు సైతం ఎక్కువ మంది క్వాలిఫై అయ్యే విధంగా గ్రేస్ మార్కులు కలపాలని సూచించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



వాకర్స్‌తో ముచ్చటిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ఎంవీపీ కాలనీ: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనని గెలిపించాలని కోరుతూ పీడీఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ శుక్రవారం ఎంవీపీ కాలనీలో ప్రచారం చేశారు. ఉదయం ఎంవీపీ కాలనీలోని వీఎంఆర్‌డీఏ హెల్త్ ఏరీనాలో వాకర్స్‌తో సమావేశమయ్యారు. ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎఫ్ బృందం తరపున ఆర్‌కేఎస్‌వీ కుమార్, రాజేశ్వరరావు, యూఎస్ఎన్ రాజు, ఎల్‌జే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు స్నేహ క్లబ్ వితరణ



శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న స్నేహ క్లబ్ సభ్యులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం పక్కన శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులకు స్నేహ క్లబ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శుక్రవారం వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కార్యదర్శి పున్నారావు, గురుకులం అధ్యాపకులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు

కొమ్మాది: చేపల తిమ్మాపురంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం జిల్లా శిక్షణ విద్యా సంస్థ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు సందర్శించారు. పనులు ఏ మేరకు జరుగుతున్నాయో పరిశీలించారు. అనంతరం ఇంగ్లిష్, తెలుగు, గణితంపై పిల్లలను ప్రశ్నించారు. లీడ్, లెసన్ ప్లానింగ్స్, డైరీ, పిల్లల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు.

ఎంవీపీ రైతుబజార్‌లో సమస్యల తిష్ట

- పని చేయని సీసీ కెమెరాలు
- వెలగని వీధి దీపాలు
- వాచ్‌మన్ లేక కొరవడిన భద్రత



పనిచేయని సీసీ కెమెరా



ఎస్టేట్ కార్యాలయం పక్కనే వెలగని విద్యుత్ దీపం



ఎంవీపీ రైతు బజార్

ఆరిలోవ: ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో సమస్యలు తిష్టవేశాయి. సౌకర్యాలు లేమితో వినియోగదారులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలో పెద్ద రైతుబజార్లలో ఇదొకటి. ఇక్కడ 178 స్టాళ్లు ఉన్నాయి. అన్ని రకాల కూరగాయలతో పాటు నిత్యావసర సరకులు కూడా అందుబాటులో ఉంటాయి. గిరిజన ఉత్పత్తులతో ప్రత్యేకంగా జీసీసీ స్టాల్ కూడా ఉంది. ఈ రైతుబజార్‌కు ఆరిలోవ, రవీంద్రనగర్, చినగదిలి, పెదగదిలి, విశాలాక్షినగర్, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండతో పాటు ఎంవీపీ కాలనీ, లాసన్స్‌బే కాలనీ, ఇసుకతోట, వెంకోజీపాలెం, తదితర ప్రాంతాల నుంచి వినియోగదారులకు కూరగాయలు కొనుగోలు కోసం వస్తుంటారు. దీంతో ప్రతి రోజూ ఈ రైతుబజార్‌కు వినియోగదార్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆది, మంగళవారాలతో పాటు సెలవు రోజులు, పండగ రోజుల్లో మరింత రద్దీగా ఉంటుంది. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రస్తుతం ఈ రైతుబజార్‌లో సమస్యలు తిష్టవేశాయి. ఇక్కడ సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఉండాల్సిన వాచ్‌మన్ జాడలేదు.

ఇవీ సమస్యలు

➽ సీసీ కెమెరాలు లేకపోవడంతో సెల్‌ఫోన్ల చోరీలు తరచూ జరుగుతున్నాయి. రద్దీగా ఉన్న సమయంలో వినియోగదారుల జేబులో నుంచి సెల్‌ఫోన్‌లు దొంగలు తీసేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఫలితం ఉండడం లేదు. గతంలో సీసీ కెమెరాలు పనిచేస్తుండడంతో ఫోన్ దొంగలు దొరికిపోయేవారు. ఇప్పుడు కెమెరాలు పనిచేయకపోవడంతో మళ్లీ దొంగతనాలు సాధారణమైపోయిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా షాపుల వద్ద నాణ్యమైన కూరగాయలు ఎంచుకోవడానికి ఎక్కువ మంది వినియోగదారులు గుమిగూడి ఉంటారు. ఆ సమయంలో జేబు దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. రైతుబజార్ ఎస్టేట్ కార్యాలయంలో తరచూ ఈ ఘటనలపై ఫిర్యాదులు చేస్తున్నారు. గతంలో ఇక్కడ 8 సీసీ కెమెరాలు ఉండేవి. కరోనా సమయంలో రద్దీ తగ్గడంతో ఇక్కడ పాలనా వ్యవహారం అంతంత మాత్రంగా మారిపోయింది. సీసీ కెమెరాలు నిర్వహణను సైతం అధికారులు పట్టించుకోలేదు. దీంతో అవి మూలకు చేరాయి. సుమారు రెండేళ్లకు పైగా ఈ కెమెరాలు పనిచేయడం లేదు.

➽ ఇక్కడ ఐదు చోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. ఇది పెద్ద రైతుబజార్ కావడంతో అవసరమైన 16 చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఐదు చోట్ల కొన్ని నెలలుగా దీపాలు వెలగడం లేదు. వాటిలో రైతుబజార్ లోపల ఎస్టేట్ ఆఫీస్ పక్కన, ప్రధాన ద్వారం వద్ద ఉన్న వీధి దీపాలు వెలగకపోవడం విశేషం. దీంతో సాయంత్రం సమయంలో వినియోగదారులు, రైతులు చీకట్లో ఇబ్బందిపడుతున్నారు. రైతుబజార్ సాధారణంగా ప్రతి రోజూ రాత్రి 8 గంటల వరకు ఉంటుంది. ఆ సమయం వరకు కొందరు వినియోగదార్లు కూరగాయలు కోసం వస్తుంటారు. వారు ఇక్కడ చీకటిలో కూరగాయలు కొనడానికి ఇబ్బందిపడుతున్నారు.

➽ ఇక్కడ రైతుబజార్ ఏర్పాటు చేసినప్పటి నుంచి నైట్ వాచ్‌మన్‌ను నియమించారు. ఏడు నెలల క్రితం ఆ వాచ్‌మన్ మృతి చెందడంతో ఇక్కడ ఆ పోస్టు ఖాళీగా ఉండిపోయింది. ఇక్కడి రైతులు విక్రయించగా మిగిలిన కూరగాయలను రాత్రి వేళ స్టాళ్లలోనే భద్రపరుస్తుంటారు. నైట్ వాచ్‌మన్ లేకపోవడంతో రాత్రి సమయంలో కూరగాయలను పట్టుకుపోతున్నారని రైతులు వాపోతున్నారు.

కొద్ది రోజుల్లో సమస్యలకు పరిష్కారం

ఇక్కడ సీసీ కెమెరాలు, వీధి దీపాలు కొత్తవి ఏర్పాటు చేయడానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. కరోనా నుంచి సీసీ కెమెరాలు పని చేయడంలేదు. నైట్ వాచ్‌మన్‌ను కూడా నియమించనున్నాం. ఇటీవల ఇక్కడ సందర్శించిన మార్కెట్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే దృష్టికి ఈ సమస్యలను తీసుకెళ్లాం. ఆయన కూడా సానుకూలంగా స్పందించారు. రైతుబజార్‌లో ఉన్న సమస్యలకు కొద్ది రోజుల్లో పరిష్కారం లభిస్తుంది.

– యాసిన్, జిల్లా మార్కెట్ శాఖ ఏడీ

ఉచిత బీపీ, మధుమేహ పరీక్షలు రేపు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి రవీంద్రనగర్‌లో సేవా స్ఫూర్తి అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య సేవలు అందించనున్నారు. అపోలో ఆస్పత్రి డయాగ్నోస్టిక్ సహకారంతో ప్రతి నెలా రెండు, నాలుగు ఆదివారాలలో బీపీ, మధుమేహం వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేయనున్నట్టు సేవా స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సేవలు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉచిత సేవలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కృష్ణా కళాశాల క్రికెట్ జట్టుకు అభినందనలు



విజయం సాధించిన కృష్ణా జట్టుతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం : ది హిందూ ఫ్యూచర్ ఇండియా క్లబ్ అసోసియేషన్, విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎంవీపీ కాలనీలో ఆళ్వార్ దాసు గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన జట్టు సభ్యులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, స్పోర్ట్స్ డైరెక్టర్ సంధ్యారాణి అభినందించారు.

మహిళా పోలీస్ జిల్లా అడ్‌హాక్ కమిటీ ఎన్నిక



రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన రాధిక



జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన ఎండీ నూర్జహాన్ బేగం

మధురవాడ: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీస్ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటైనట్టు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధిక తెలిపారు. మధురవాడకు చెందిన ఈమెకు ఇటీవల విశాఖ జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. ఈ మేరకు జూమ్ మీటింగ్ ద్వారా చర్చించి కమిటీ ఎన్నిక నిర్వహించారని ఆమె తెలిపారు.

జిల్లా కార్యవర్గం సభ్యులు

జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షురాలిగా ఎండీ నూర్జహాన్ బేగం, జనరల్ సెక్రటరీగా ఇ.మాధురి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఒబ్బి రమాదేవి, వైస్ ప్రెసిడెంట్‌గా టీవీ శ్రీలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా ఆకాంక్ష పండా, పి.శిరీష, ఎస్.రామలక్ష్మి, రేష్మ బేగం, ట్రెజరర్‌గా కె.నాగమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.రంజిత, జాయింట్ సెక్రటరీలుగా ఆదిలక్ష్మి, బి.రేవతి, పైడితల్లి, నిరుపమ, భవానీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా పి.శైలజ, దేవి ప్రియాంక, డి.సల్మా, నూకరత్నం, రాధ, మీనాకుమారి, కె.లీలా ఎన్నికయ్యారు. వీరిని రాష్ట్ర అధ్యక్షురాలు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మధులత అభినందించారు.

ఒమేగాలో స్టోమా క్లినిక్ ఏర్పాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఒమేగా వైద్యులు

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని 'ఒమేగా'లో స్టోమా క్లినిక్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ బి.రవిశంకర్ తెలిపారు. ఆస్పత్రిలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగులు కోలోస్టొమీ, ఇలియోస్టొమీ తదితర శస్త్రచికిత్సలు జరిపించుకున్న అనంతరం ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఇక్కడ వైద్య సేవలందించనున్నట్లు చెప్పారు. అలాంటి శస్త్ర చికిత్సలు జరిగిన రోగుల్లో మూత్రాశయం, పెద్ద ప్రేగుల సమస్యలు ఎదురవుతాయన్నారు. ఆ సమస్యలు పొగట్టడానికి ఇక్కడ ప్రత్యేకంగా స్టోమా క్లినిక్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ క్లినిక్‌లో ప్రతి శనివారం ఉదయం 9 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఆస్పత్రి జీఎం కె.వి సుబ్రహ్మణ్యేశ్వరరావు, డాక్టర్ కె.విజయకుమార్, డాక్టర్ వి.కల్యాణ్, డాక్టర్ రాఘ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ నిర్వాకం

హాల్ టికెట్లు అందక పరీక్ష రాయలేకపోయిన ఇద్దరు విద్యార్థులు



పరీక్ష కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెదగంట్యాడ: ఓ ప్రైవేటు స్కూల్ నిర్వాకం ఇద్దరు విద్యార్థులకు శాపంగా మారింది. లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించినప్పటికీ ఆఖరి నిమిషంలో హాల్ టికెట్లు అందకపోవడంతో వారిద్దరూ పరీక్ష రాయలేకపోయారు. పెదగంట్యాడ వుడా కాలనీలోని టింపనీ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. భీమిలి క్రాస్ రోడ్డులోని ది హార్బర్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 43 మంది పదో తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్ష రాసేందుకు టింపనీ స్కూల్‌కు వచ్చారు. అందులో బొబ్బిలికి చెందిన బి.సాయిదుర్గ హర్షవర్ధన్, నర్సీపట్నానికి చెందిన సూరిశెట్టి తరుణ్‌లకు హాల్ టికెట్లు అందజేయకపోవడంతో పరీక్ష కేంద్రం నుంచి ఉసూరుమంటూ బయటకు వచ్చేశారు. వెంటనే సంబంధిత పాఠశాలను సంప్రదిస్తే పరీక్ష సమయానికి వస్తాయని చెప్పడంతో వారు వేచి చూశారు. ఎంత సేపటికీ హాల్ టికెట్లు రాకపోవడం, తోటి విద్యార్థులంతా పరీక్ష కేంద్రంలోకి వెళ్లడంతో కన్నీటి పర్యాంతమయ్యారు. ఇది గమనించిన వారిద్దరి తల్లిదండ్రులతోపాటు మిగిలిన విద్యార్థుల పేరెంట్స్ ఆందోళనకు దిగారు. అక్కడికి వచ్చిన హార్బర్ స్కూల్ కరస్పాండెంట్ వైఎస్ నాయుడును నిలదీశారు. తమ పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకున్నారంటూ ఆవేదన చెందారు. సాంకేతిక కారణాల వల్లే ఆ ఇద్దరి విద్యార్థులకు సమయానికి హాల్ టికెట్లు ఇవ్వలేకపోయమని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చెప్పడంతో వారంతా ఆగ్రహానికి లోనయ్యారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. న్యూపోర్టు పోలీసులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

కోలా గురువులకు సత్కారం



కోలా గురువులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, అనూష పట్నాయక్

బీచ్‌రోడ్డు: ఎమ్మెల్సీ అభ్యర్థి, మత్స్య శాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులకు శుక్రవారం ఘనంగా సన్మానం జరిగింది. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష శీధర్ పట్నాయక్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఆయన్ని సత్కరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆయన్ని ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ.. ఈ కార్యక్రమం చేపట్టినట్లు అనూష తెలిపారు. శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్లు చంద్రమౌళి, నాగమణి, రాధ, బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో త్రిషాలీ, శ్రీకృష్ణకు స్వర్ణాలు



వితోలి బ్యాడ్మింటన్ విజేతలు

విశాఖ స్పోర్ట్స్: అమరావతి వీఐటీలో నిర్వహించిన వితోలి బ్యాడ్మింటన్ టోర్నీలో జి.త్రిషాలీ వుమెన్ సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో పి.విన్నీ(కె.ఎల్.యూ)పై 21–8, 21–8 పాయింట్ల తేడాతో విజయం సాధించి స్వర్ణాన్ని అందుకుంది. మెన్ ఫైనల్ సింగిల్స్‌లో శ్రీకృష్ణ 2–0 సెట్ల తేడాతో యశ్వంత్(కె.ఎల్.యూ)పై, డబుల్స్‌లో ఎ.రూపేష్‌తో కలిసి స్ట్రయిట్ సెట్లలోనే సుల్తాన్–ఆదిత్య(వీఐటీ)జోడీపై విజయం సాధించి స్వర్ణాలందుకున్నారు. గీతం విద్యార్థులైన వీరంతా నాలుగు కేటగిరీల్లో పాల్గొని మూడు పతకాలు సొంతం చేసుకున్నారు.

ఏఎన్‌ఎంలకు సర్దుబాటు కౌన్సెలింగ్

మహారాణిపేట: జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం) ఉత్తీర్ణత సాధించి ఆక్సిలరీ నర్సింగ్ మిడ్ వైఫరీ (ఏఎన్ఎం)గా పనిచేస్తున్న వారికి శుక్రవారం సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంఈ, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ఉమాసుందరి ఈ ప్రక్రియ చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 195 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడం వల్ల ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తామని ఆర్డీ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామన్నారు.

ఏయూ సమాచారం

ఎఫ్‌డీఏ బృందం అమెరికన్ కార్నర్ సందర్శన



అమెరికన్ కార్నర్‌లో ఎఫ్‌డీఏ బృందం సభ్యులతో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అమెరికన్ కార్నర్‌ను అమెరికాలోని ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ డాక్టర్ కార్మిలో రోసాతో కూడిన ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా గతేడాది కాలంలో అమెరికన్ కాన్సులేట్ సహకారంతో 40 కార్యక్రమాలను నిర్వహించినట్టు కేంద్రం సమన్వయకర్త ఆచార్య జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. గతేడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను ఆయన వివరించారు. ఏయూతో అమెరికన్ కాన్సులేట్‌కు ఉన్న అనుబంధం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, యూఎస్ కంజ్యూమర్ సేఫ్టీ ఆఫీసర్ సలీమ్ అక్తర్, సీనియర్ పాలసీ అడ్వైజర్ బ్రూక్ హిగ్గిన్స్, ఓఆర్‌ఏ నేషనల్ ఎక్స్‌పర్ట్ జోన్ మెలెంజ్, అమెరికాకు చెందిన వయాట్రిస్ గ్లోబల్ క్వాలిటీ వైస్ ప్రెసిడెంట్ దేవ పురాణం, ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ధనుంజయరావు, పాలక మండలి సభ్యురాలు ఎ.కె.ఎం.పవార్, పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక యువకుడి బలవన్మరణం



నీలి మోహన కృష్ణ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ ఎం.రవి కుమార్, మృతుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాలివి.. భెల్ టౌన్ షిప్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్న నీలి భావనారుషి, పార్వతి దంపతుల కుమారుడు మోహన కృష్ణ (28). వీరు భెల్ టౌన్‌షిప్ క్వార్టర్ ఎఫ్ – 65లో నివాసం ఉంటున్నారు. మోహన కృష్ణ వ్యాన్ కొనుక్కుని, స్వయంగా నడుపుకొనేవాడు. ఈ క్రమంలో 69వ వార్డు తుంగ్లాంకు చెందిన వాకాడ శ్రీనివాసరెడ్డి వద్ద రూ.40వేలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని నిత్యం వేధిస్తుండటంతో, గురువారం అర్ధరాత్రి తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ ఎం.రవికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అధిక వడ్డీలతో వేధింపులకు గురిచేస్తాడని శ్రీనివాసరెడ్డిపై ఎన్నో ఆరోపణలున్నాయని గ్రామస్తులు తెలిపారు. అతని వేధింపుల వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అందివచ్చిన కొడుకు తనువు చాలించడంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు.

నైపుణ్యాల సాధనతో ఉన్నతావకాశాలు



ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్(విశాఖ ఉత్తర): విద్యార్థులు వారు చదువుతున్న కోర్సుకు సంబంధించిన నైపుణ్యాలు సాధించినప్పుడే ఉన్నత అవకాశాలు పొందుతారని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో ఐఎస్‌టీడీ ఆధ్వర్యంలో శుక్రవారం నైపుణ్యాభివృద్ధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఎస్‌టీడీ గౌరవ కార్యదర్శి డాక్టర్ వై.హేమ విద్యార్థులకు ఐఎస్‌టీడీ స్టూడెంట్ చాప్టర్ విధివిధానాలను వివరించారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ జనరల్ మేనేజర్ డాక్టర్ ఒ.రామమోహనరావు సాంకేతిక అంశాలపై ప్రసంగించారు. అనంతరం ప్రొఫెసర్ సాంబశివరావును సత్కరించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ సీఈవో పి.సునీల్, కాలేజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, డి.దామోదరరావు, ఎస్.ప్రశాంతకుమారి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే విద్యలో పురోగతి

పీఎం పాలెం: ప్రణాళికాబద్ధంగా కృషి చేసే విద్యార్థులకే ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడం సులువు అవుతుందని ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నారు. స్థానిక సాంకేతిక పాలిటెక్నిక్ వార్షికోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. మరో అతిథి బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బీఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులపై మంచి పట్టు సాధించడానికి ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తుచ తప్పకుండా పాటించాలని హితవు పలికారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పోటీల్లో విజయం సాధించిన వారికి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్. రాజేంద్ర, ఎగ్జికూటివ్ డైరెక్టర్ రాహుల్, స్థానిక ప్రిన్సిపాల్ ఎ. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులన్నీ అక్రమ, అనధికార కట్టడాలపైనే..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ స్పందన



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ అన్ని జోన్లలో చేపడుతున్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళికా విభాగం శుక్రవారం స్పందన నిర్వహించింది. అక్రమ.. అనధికార కట్టడాలపైనే ఫిర్యాదులన్నీ వచ్చాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. వాటి వివరాలిలా.. జోన్–1 నుంచి భీమిలి చిట్టివలసకు చెందిన జి.శ్రీనివాసరావు జోన్ పరిధిలో అక్రమ, అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయగా.. భీమిలికి చెందిన ఎస్.ఆర్.రాజా సంగివలస అనిట్స్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. జోన్–3 నుంచి పాత రేసపువానిపాలేనికి చెందిన హితేష్‌కుమార్ జైన్ టీడీఆర్ సర్టిఫికెట్ కోసం, నక్కవానిపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని అదే ప్రాంతానికి చెందిన కర్రి గణపతి, శివాజీపాలెంలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని పి.ఎల్.వి. ఎన్.మూర్తి, పెదవాల్తేరుకు చెందిన తెడ్డు శంకరరావు ఫిర్యాదు చేశారు. జోన్–4 నుంచి 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్ సూర్యాబాగ్ లైన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, ఎటువంటి సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్నారని, రెసిడెన్షియల్ ఏరియాలో కమర్షియల్ బిల్డింగ్స్ కడుతున్నారని ఫిర్యాదు చేశారు. జోన్–5 నుంచి సనపల నాగచంద్రుడు జోన్ పరిధిలో అక్రమ బిల్డింగ్ నిర్మాణాలకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఎలా అనుమతులు ఇచ్చిందని, జోన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించాలని తాటిచెట్లపాలేనికి చెందిన చిల్లా వెంకటస్వామి, దయాల్‌నగర్ నుంచి జె భువనేశ్వరిదేవి జోన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య రత్నకుమార్, నరేంద్రనాథ్‌రెడ్డి, కె.పద్మజ, ఏసీపీలు, టీపీవో, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్ర వారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వ హించారు. ముందుగా మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం టీటీడీ అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి భక్తులకు దర్శనం కల్పించారు.